సాక్షి నిజామాబాద్


గురువారం । 21 । డిసెంబర్ । 2023



పరీక్షా కేంద్రాల తనిఖీ

తెయూ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ, పీజీ పరీక్షలను యూనివర్సిటీ అధికారులు తనిఖీ చేశారు.

- 8లో ▸



ప్రమాదపుటంచున..

పలు పాఠశాలల పక్కనే ప్రమాదకరంగా కాల్వలు, చెరువులు ఉన్నాయి. విద్యార్థులు ప్రమాదాల బారినపడే అవకాశాలున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 26.7/14.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. శీతలగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నిజామాబాద్‌నాగారం: కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆదేశించారు. బుధవారం జెడ్పీ స్థాయి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా నేపథ్యంలో పాఠశాలల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర విభాగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆయా మండలాల్లో జరిగే కార్యక్రమాలపై జెడ్పీటీసీలకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జెడ్పీటీసీలు గంగాధర్, సుమనరెడ్డి, జెడ్పీ సీఈవో గోవిందనాయక్, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఈవో దుర్గాప్రసాద్, ఆయుష్ జిల్లా అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు మెంబర్లుగా ముగ్గురికి అవకాశం



కందుల జశ్వంత్



ఆదిశ్ కొర్వ



శీల శ్రీనివాస్

సుభాష్‌నగర్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్ బోర్డు) మెంబర్లుగా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు చెందిన ముగ్గురు బీజేపీ నాయకులకు అవకాశం కల్పించింది. ఈ మేరకు బోర్డు రీజినల్ కార్యాలయ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శీల శ్రీనివాస్‌తోపాటు పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి ఆదిశ్ కొర్వ, జాయింట్ కార్యదర్శి కందుల జశ్వంత్‌ను నియమించారు. వీరు రెండేళ్ల పాటు సెన్సార్ బోర్డు మెంబర్లుగా కొనసాగనున్నారు. తమకు అవకాశం కల్పించిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రాస్ కంట్రీ పోటీల ఏర్పాట్లపై సమీక్ష



కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో ఈనెల 23న నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ఏర్పాట్లపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌ల సమక్షంలో సమావేశం సాగింది. రిసెప్షన్, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు వసతి, భోజన ఏర్పాట్లు, గ్రౌండ్ ప్రిపరేషన్, రిసీవింగ్ కమిటీల ఏర్పాటుపై సమీక్షించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు దత్తు, నవీన్, శేర్ల రమేష్, ఆర్.శ్రీనివాస్, ఎస్.మధుసూదన్‌రెడ్డి, శివాగౌడ్, రాజేందర్‌రెడ్డి, ఎ.సరిత, అరుణ, రేణుక, విజయలక్ష్మి, ప్రియాంక, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పీహెచ్‌సీలు

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో తొలిసారి మాట్లాడారు. ఆయన 21 నిమిషాల పాటు ప్రసంగించి, నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీలలో సరిపడా సిబ్బంది లేక సరైన సేవలు అందడం లేదన్నారు. అలాగే గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ ద్వారా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరిస్తామని గత సీఎం కేసీఆర్ చెప్పారని, కానీ ప్యాకేజీ పరిధిలో తట్టెడు మట్టిని కూడా తీయలేదని పేర్కొన్నారు.

చక్కెర చుట్టూ రాజకీయం!



- పార్లమెంట్ ఎన్నికల ప్రధాన అంశంగా ఎన్‌ఎస్‌ఎఫ్
- శాసనసభ ఎన్నికల్లోనూ నినాదంగా వాడుకున్న బీజేపీ, కాంగ్రెస్
- ఫ్యాక్టరీని తెరిపించేందుకు సీఎం చర్యలు
- పసుపు బోర్డు తర్వాత ఫలితాలను ప్రభావితం చేయనున్న ఫ్యాక్టరీ అంశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు ప్రధానాంశంగా మారగా.. రానున్న ఎంపీ ఎన్నికల్లో చక్కెర ఫ్యాక్టరీ ప్రధాన ప్రచారాస్త్రంగా మారనుంది. నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో నిజాంషుగర్స్ అంశం ప్రభావితం చేయనుంది. వ్యవసాయపరంగా ముందంజలో ఉన్న ఈ జిల్లాల్లో రైతు అంశాలే ప్రధానం అవుతాయి. దీంతో అన్ని పార్టీలు రైతుల అవసరాలు, సమస్యలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో రెండు ప్రధాన జాతీయ పార్టీలు నిజాంషుగర్స్ తిరిగి తెరిపించే నినాదాన్ని గట్టిగానే వాడుతూ వస్తున్నాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సైతం ఎన్‌ఎస్‌ఎఫ్ అంశాన్ని ప్రచారంలో బాగానే వాడుకున్నాయి. తాజాగా ఈ అంశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఎందుకంటే గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని తిరుగులేని అస్త్రంగా వాడుకున్న భారతీయ జనతా పార్టీ అనూహ్యంగా విజయం సాధించింది. గత ఎంపీ ఎన్నికల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి.. ధర్మపురి అర్వింద్ భారీ మెజారిటీతో గెలుపొందారు. దీంతో తాజా శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్రానికి వచ్చిన ప్రధానమంత్రి మోదీ పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన చేశారు. దీంతో రాష్ట్రంలో బీజేపీకి 8 అసెంబ్లీ స్థానాలు రాగా, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఏకంగా 7 సీట్లు దక్కడం ఆ ప్రకటన ప్రభావాన్ని చెప్పకనే చెబుతోంది. దీంతో బీజేపీ జాతీయ నాయకత్వం ఇందూరు కేంద్రంగా ఉత్తర తెలంగాణలో లోక్‌సభ స్థానాలన్నింటినీ గెలుచుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో నిజాంషుగర్స్ అంశాన్ని బలమైన ప్రచారాస్త్రంగా ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా గతంలో పసుపు రైతులను మెప్పించిన మాదిరిగా చెరుకు రైతులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

నిజాంషుగర్స్‌ను తెరిపించేందుకు..

తాజా శాసనసభ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా నిజాంషుగర్స్ తెరిపిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో ఆ దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇటీవల ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో ఎన్‌ఎస్‌ఎఫ్‌ను తెరిపించేందుకు రంగం సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా నిజాంషుగర్స్‌ను తెరిపించే విషయంలో బోధన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సైతం పట్టుదలగా ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పాటు మరో రెండు మూడు నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాల్సి రానుండడంతో ఫ్యాక్టరీని తిరిగి తెరిపించే విషయమై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సీరియస్‌గా కసరత్తు చేస్తోంది. దీంతో చెరుకు రైతులు సానుకూలంగా ఉంటారని భావిస్తున్నారు.

చేష్టలుడిగిన బీఆర్‌ఎస్..

ఇక గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ మాత్రం నిజాంషుగర్స్ తెరిపించే విషయంలో మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరించింది. ఎన్‌ఎస్‌ఎఫ్‌ను చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రైవేటు పరం చేయడం జరిగింది. ఇందులో అనేక అక్రమాలు జరిగినట్లు అప్పటి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో శాసనసభా కమిటీ నిగ్గుతేల్చింది. ఇదిలా ఉండగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. దీంతో అనేక కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రైతులు చెరుకు సాగు నుంచి వరి సాగుకు మళ్లాల్సి వచ్చింది. అప్పటి నుంచి నిజాంషుగర్స్ విషయంలో ఎదురుచూపులే మిగిలాయి. ఈ క్రమంలో ఈ అంశాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుండగా, బీఆర్‌ఎస్ మాత్రం చేష్టలుడిగి చూస్తోంది.

గత ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం ప్రభావితం చేసిన విధంగానే చక్కెర రైతులకు సంబంధించిన నిజాంషుగర్స్ అంశం కీలకం కానుందని కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో ప్రధానంగా బీజేపీని ఎదుర్కోవాల్సి వస్తున్నందున, పైగా బీజేపీ నిజాంషుగర్స్ అంశాన్ని పసుపు బోర్డు తరహాలో తామే పరిష్కరిస్తామని చెబుతుండడంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా వ్యవహరిస్తోంది.

కారే పట్టించింది..!



హత్య కేసులో నిందితులు ఉపయోగించిన కారు ఇదే..

- చేగుంట, దూదిగాం, భూంపల్లిలలో వాహనం ఆనవాళ్లు
- సీసీ ఫుటేజీలో నమోదైన కారు నంబర్‌తో పట్టుబడ్డ నిందితులు

ఖలీల్‌వాడి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఒకే ఇంటికి చెందిన ఆరుగురు కుటుంబసభ్యుల హత్య కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు వాడిన కారే వారిని పట్టించింది. మాక్లూర్‌కు చెందిన ప్రసాద్‌తో పాటు అతని భార్య రమణి, ఇద్దరు కవల పిల్లలు చైత్రిక, చైత్రిక, చెల్లెలు స్రవంతి, స్వప్నలను ప్రశాంత్ మరో నలుగురితో కలిసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూంపల్లి వద్ద స్వప్నను పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ కేసును సదాశివనగర్ పోలీసులు దర్యాప్తు చేశారు. పోలీసులు భూంపల్లి పరిసర ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఇందులో రాత్రివేళ కనిపించిన కారు ఆధారంగా పోలీసులు కేసు విచారణ చేపట్టడంతో నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. సాంకేతికత ఆధారంగా పోలీసులు ప్రధాన నిందితుడు ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో ప్రసాద్ కుటుంబసభ్యుల హత్య ఉదంతం బయట పడింది. పోలీసుల విచారణలో ప్రశాంత్ ముందుగా ప్రసాద్‌ను హతమార్చి, మిగతా కుటుంబ సభ్యులను హత్య చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

కస్టడీ కోసం కోర్టును ఆశ్రయించిన పోలీసులు

ఆరుగురి హత్య కేసులో నిందితులను కస్టడీకి ఇవ్వాలని సదాశివనగర్ పోలీసులు ఎల్లారెడ్డిలోని కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. వారిని కస్టడీకి తీసుకున్న అనంతరం హత్య చేసిన ప్రాంతాల్లో సీన్ కన్‌స్ట్రక్షన్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ప్రసాద్, అతని భార్య రమణి మృతదేహాలు ఎక్కడ ఉన్నాయని గుర్తించాల్సి ఉంది. రెండు రోజుల్లో నిందితులను కస్టడీలోకి తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం. నిందితులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగాపూర్ జిల్లా జైలులో ఉన్నారు.

మూడు ప్రాంతాల్లో..

మాక్లూర్‌కు చెందిన ఆరుగురి హత్య కేసులో ప్రధాన నిందితుడు ప్రశాంత్ ఉపయోగించిన కారు హత్య జరిగిన మూడు ప్రాంతాల్లో పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. మెదక్ జిల్లాలోని చేగుంటలో స్రవంతిని, మెండోరా మండంలోని దూదిగాంలోని గోదావరి వద్ద కవల పిల్లలు చైత్రిక, చైత్రిక్ లను, సదాశివనగర్ మండలంలోని భూంపల్లి అటవీ ప్రాంతంలో స్వప్నలను హత మార్చేందుకు ఉపయోగించిన కారు ఒకటే. దీంతో ఈ హత్య కేసును పోలీసులు ఛేదించగలిగారు. ఈ కారు నంబర్ ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించి ప్రశాంత్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

ఇష్టారీతిన ఎస్సారెస్పీ నీటి విడుదల

- రాత్రి పెంపు.. పగలు తగ్గింపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు



కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ఇష్టారీతిన చేపడుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువ మొత్తంలో వదిలి, పగలు తగ్గిస్తున్నారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా మూడు రోజు క్రితం నీటి విడుదల ప్రారంభించారు. కాలువ ద్వారా నీటి ప్రవాహం జరుగుతన్నప్పుడు లైనింగ్‌పై నీటి ప్రవాహం అచ్చు ఏర్పడుతుంది. రాత్రివేళల్లో ఎక్కడి వరకు ప్రవహించిందో ఉదయం దానికంటే తక్కువ ఎత్తులో నీరు వెళ్తున్నాయి. దీంతో అధికారులు ఇష్టారీతిన నీటి విడుదల చేపడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి విడుదలపై సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 405 నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1088.30(77.38టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధి కక్కుర్తి!

- రెండున్నరేళ్ల పాటు గోదాం వాడుకుని కిరాయి చెల్లించని వైనం



తాణాకలాన్‌లో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోదాం

ఎడపల్లి(బోధన్): రూర్బన్ స్కీమ్ కింద ఎడపల్లి మండలంలోని తాణాకలాన్‌లో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోదాంను బోధన్ నియోజకవర్గానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి వినియోగించుకొని కిరాయి ఎగ్గొట్టాడు. తాణాకలాన్‌లో రూర్బన్ సీజీఎఫ్ ఫేస్–3 కింద రూ. 50 లక్షలతో ఈ గోదాంను నిర్మించారు. కానీ స్థానిక గ్రామ పంచాయతీకి అధికారులు అప్పగించలేదు. దీంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి తన కుటుంబీకుల రైస్‌మిల్‌కు పౌరసరఫరాల శాఖ కేటాయించిన ధాన్యాన్ని ఈ గోదాంలో నిల్వ ఉంచారు. సదరు మాజీ ప్రజాప్రతినిధి అధికారంలో ఉన్నప్పుడు రెండున్నరేళ్ల పాటు గోదాంను వాడుకున్నారు. ఎన్నికలకు ముందు గోదాంలో నిల్వ చేసిన ధాన్యాన్ని తీసుకువెళ్లినట్లు తెలిసింది. రెండున్నరేళ్లు ఎలాంటి డబ్బులు చెల్లించుకున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో పీహెచ్‌సీతో పాటు వెటర్నరీ హాస్పిటల్ భవనాలను పంచాయతీకి అందించినా.. గోదాంను మాత్రం అప్పగించలేదు. మాజీ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకే అధికారులు ఏ డిపార్ట్‌మెంట్‌కు అందించలేదనే ప్రచారం జరుగుతోంది. ఇన్ని రోజుల పాటు ప్రజా ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 500 మెట్రిక్ టన్నుల గోదాంను గ్రామ పంచాయతీ అప్పగించాలని, గోదాం అద్దెను వసూలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోదాంను జీపీకి అప్పగించలేదు

గ్రామంలో రూర్బన్ పథకం ద్వారా చేపట్టిన వెటర్నరీ భవనం, పీహెచ్‌సీ భవనాలను అప్పగించారు. కానీ ఇంత వరకు 500 మెట్రిక్ టన్నుల గోదాంను అధికారులు అప్పగించలేదు. ఇప్పటివరకు గోదాంకు సంబంధించిన కిరాయిలు గ్రామ పంచాయతీకి అందలేవు.

– నర్సయ్య, జీపీ కార్యదర్శి, తాణాకలాన్, ఎడపల్లి మండలం

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో, సాఫీగా నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీ నియోజకవర్గ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా నిర్వహణ పరమైన ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఓటరు జాబితా పక్కాగా ఉండాలని, మార్పులు, చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని సీఈవోకు వివరించారు. ఈనెల 25వ తేదీ లోపు అన్ని దరఖాస్తులు పరిష్కరిస్తామని తెలిపారు. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలు, ఓటరు క్లెయిమ్స్ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం మకరందు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బంజారా దినోత్సవంగా ప్రకటించాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్: ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా జాతీయ సెలవు దినంగా, సేవాలాల్ జీ మహరాజ్ బంజారా దినోత్సవంగా ప్రకటించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి అభ్యర్థించారు. ఈమేరకు బుధవారం పార్లమెంట్ సెషన్‌లో భాగంగా జీరో అవర్‌లో ఆయన సభనుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు తెలంగాణకు పసుపుబోర్డు, సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబర్ యూనివర్సిటీని మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి ఎంపీ అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలో తొమ్మిదేళ్లుగా గిరిజనుల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసిందని పేర్కొన్నారు. గిరిజన మహిళ ద్రౌపతి ముర్మును రాష్ట్రపతిగా ఎంపిక చేసినట్లు గుర్తుచేశారు. సంత్ సేవాలాల్ జీ మహరాజ్ బంజారా సమాజంలో గొప్ప ఆధ్యాత్మిక నాయకుడిగా పేరొందారన్నారు. దేశ ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక అభివృద్ధికి ముఖ్యంగా గిరిజన సమాజానికి ఎంతో మేలు చేశారని తెలిపారు. సేవాలాల్ మహరాజ్‌కు గొప్ప అభిమానిగా, ఆయన జయంతి రోజు ఫిబ్రవరి 15ను జాతీయ సెలవు దినంగా, బంజారా దినోత్సవంగా ప్రకటించాలని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. 2023లో మొదటిసారిగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆయన జయంతిని పురస్కరించుకుని ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తుచేశారు.


గంజాయి సేవించనందుకు విద్యార్థిపై దాడి

- మాక్లూర్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

మాక్లూర్: గంజాయి సేవించాలని ఒత్తిడి చేయగా.. అంగీకరించకపోవడంతో ఓ విద్యార్థిపై మరో ఐదుగురు విద్యార్థులు దాడి చేసిన ఘటన మాక్లూర్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థి తల్లి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఐదుగురు ప్రతిరోజూ మధ్యాహ్న భోజన విరామంలో స్కూల్‌కు కొద్ది దూరం వెళ్లి గంజాయి సేవిస్తున్నారు. గత శనివారం వారి తరగతిలోని మరో విద్యార్థిని సైతం గంజాయి సేవించాలని ఒత్తిడి తెచ్చారు. కానీ, సదరు విద్యార్థి అంగీకరించకపోవడంతో అతనిపై దాడి చేశారు. ఆ విద్యార్థి తనపై తోటి విద్యార్థులు దాడి చేసినట్లు తల్లికి చెప్పాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతో బాధిత విద్యార్థి తల్లి మాట్లాడగా గొడవ సద్దుమణిగింది. సోమవారం తిరిగి బాధిత విద్యార్థి పాఠశాలకు వెళ్లగా తల్లిదండ్రులకు చెబుతావా అంటూ ఐదుగురు విద్యార్థులు పాఠశాల సమీపంలోకి తీసుకెళ్లి చితకబాదారు. దీంతో సదరు విద్యార్థికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి బుధవారం మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై సుధీర్‌రావును సంప్రదించగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే కేసు నమోదు చేస్తామన్నారు.

చలి పంజా

- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- జుక్కల్‌లో 11.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు



సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి జిల్లాలో చలిపులి పంజా విసురుతోంది. వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా చలిగాలులు వీస్తుండడంతో జనం విలవిల్లాడుతున్నారు. జుక్కల్‌లో బుధవారం అత్యల్పంగా 11.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్పుగొండలో 11.6, బీబీపేటలో 11.7, దోమకొండలో 11.8, లచ్చాపేటలో 12 డిగ్రీలుగా నమోదైంది. చలితో చాలామంది జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే వారు చలితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్లుప్తంగా

లక్ష్మి కాలువ నీటి విడుదల



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి జిల్లా ఆయకట్టు రైతుల కోసం లక్ష్మి కాలువ ద్వారా సరఫరా చేసే నీటిని బుధవారం విడుదల చేసినట్లు ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్‌ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న తెలిపారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సకాలంలో నీటి విడుదలకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముందుగా 50 క్యూసెక్కుల నీటిని వదిలారు. క్రమంగా నీటివిడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, డీఈఈ సురేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, ఆయకట్టు రైతులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ ఏజీఎం, డీడీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌టీఐలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను నాబార్డు ఏజీఎం బుధవారం ప్రారంభించారు.మార్కెట్‌లో ఉమెన్స్ టైలరింగ్‌కు మంచి మార్కెట్ ఉందన్నారు. నాబార్డ్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం సంస్థ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్, అర్చన, నర్మద, బ్యాంకు పీవోలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు బంగారు పతకాలు



ఆర్మూర్: హైదరాబాద్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు బుధవారం బంగారు పతకాలు సాధించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన డాకూరి భాను ప్రసాద్ 86 కిలోల విభాగంలో, 65 కిలోల విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ రహమాన్ విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా జిల్లా వాసులకే రెండు బంగారు పతకాలు రావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పాలిటెక్నిక్‌లో సృజన టెక్ ఫెస్ట్

నిజామాబాద్‌అర్బన్: పాలిటెక్నిక్ కోర్సు విద్యార్థుల్లోని సృజనాత్మకతను, పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సృజన టెక్ ఫెస్ట్ గురువారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నరేశ్ బుధవారం తెలిపారు. ఎలక్ట్రానిక్స్ సంబంధిత బ్రాంచీల ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని వెల్లడించారు.

ప్రమాదపుటంచున చదువులు

- కాలువలు, చెరువులకు సమీపంలో పాఠశాలలు
- స్కూళ్ల పక్కనే కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చదువుకునేందుకు బాన్సువాడ మండలం కొత్తాబాదిలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన బాలుడు.. ప్రమాదవశాత్తూ స్కూల్ పక్కనే ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనతో కన్నవారికి కడుపుకోత మిగిలింది. పాఠశాల పక్కన గోదాం నిర్మాణం కోసం గతంలో ప్రహరీని కూల్చి వేసి అలాగే వదిలేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కూల్చిన ప్రహరీని తిరిగి నిర్మించకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. ప్రహరీని నిర్మించి ఉంటే బాలుడి ప్రాణాలు నిలిచేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పిట్లం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ ఇనుప స్తంభం



కేవ్లానాయక్ తండా ప్రైమరీ స్కూల్ ఎదురుగా రక్షణ గోడ లేని నిజాంసాగర్ కాలువ

సాక్షి ఫోకస్

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు అన్నీ కలిపి 1,240 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1,58,518 మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే పలు పాఠశాలల ఆవరణలో ప్రమాదం పొంచి ఉంది. కొన్నిచోట్ల స్కూల్ పక్కనే కెనాల్స్, మరికొన్ని చోట్ల చెరువులు ఉన్నాయి. అలాగే పాఠశాలల సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప స్తంభాలు ఉన్నాయి. ఇంకొన్ని చోట్ల స్కూళ్ల ఆవరణలో పెద్దపెద్ద గుంతలున్నాయి. వర్షాకాలంలో అయితే ఎక్కడ నీటి మడుగు ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వేలాడే వైర్లతో పిల్లలకు ఎక్కడ కరెంట్‌షాక్ కొడుతుందోనని తల్లిదండ్రులు భయపడుతుంటారు. ఇలాంటి పాఠశాలలు జిల్లాలో చాలా ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ కాలువలలో పడిపోతే ప్రాణాలు పోతాయని తెలిసినా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న పాఠశాలలపై 'సాక్షి' ఫోకస్..

- పిట్లం మండల కేంద్రంలోని బోయివాడ పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. విద్యార్థులు అక్కడే ఆడుకుంటుంటారు.
- పిట్లం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది.
- మద్నూర్ మండలం దన్నూర్ పాఠశాలను ఆనుకుని కాలువ ఉంది. వర్షాకాలంలో కాలువ నిండా నీరు పారుతుంటుంది.
- బాన్సువాడ మండలం కొయ్యగుట్ట తండా పరిధిలోని కేవ్లానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఎదురుగా నిజాంసాగర్ ఉపకాలువ ప్రవహిస్తుంది. పిల్లలు ఆడుతూ రోడ్డు దాటితే నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది.
- నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లి గ్రామంలో నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఆనుకుని ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాలకు ప్రహరీ లేదు. దీంతో ప్రమాదం పొంచి ఉంది.
- గాంధారి మండలం సీతాయిపల్లిలో ప్రాథమిక పాఠశాల చెరువు అంచున ఉంది. పాఠశాలకు ప్రహరీ లేదు.
- దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలోని ఎస్సీ వాడ పాఠశాలకు ప్రహరీ లేదు. పాఠశాల పక్కనుంచే మురికి కాలువ పారుతుంది.
- బాన్సువాడ పట్టణంలో పాఠశాలకు ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది.
- లింగంపేట మండలం సురాయిపల్లి తండాలో స్కూల్‌కు ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది.

రక్షణ గోడ నిర్మించాలి



పాఠశాల పక్కన నిజాంసాగర్ కెనాల్ ఉంది. డిస్ట్రిబ్యూటరీలకు నీళ్లు వదిలినపుడు భయంభయంగా గడుపుతుంటాం. పిల్లలు అటువైపు వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతాం. తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నా.. లంచ్ టైంలోనో, ఇంటర్‌వెల్ టైంలోనో పిల్లలు బయటకు వెళ్తే ఎక్కడ నీళ్లలో పడతారోననే ఆందోళన ఉంటుంది. కాలువ వద్ద రక్షణ గోడ నిర్మించాలి.
– మనోజ్ సంతోష్, హెచ్‌ఎం, కేవ్లానాయక్ తండా

డిగ్రీ, పీజీ పరీక్షల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ కంట్రోలర్ అరుణ, ప్రిన్సిపాల్ ఆరతి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, అడిషనల్ కంట్రోలర్ సాయిలుతో కలిసి పరిశీలించారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 9797 మందికి గాను 9164 మంది హాజరు కాగా 633 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన డిగ్రీ 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 8356 మంది విద్యార్థులకు 7578 మంది హాజరు కాగా 778 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే పీజీ ఎంబీఏ, ఎంసీఏ 3వ సెమిస్టర్, ఐఎంబీఏ 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 538 మంది విద్యార్థులకు 507 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ అరుణ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు ఉపాధ్యాయుల ఎంపిక

నిజామాబాద్‌అర్బన్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈ నెల 22న నిర్వహించే రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చౌడారపు రాంప్రసాద్, కోనసముద్రం పాఠశాల ఉపాధ్యాయుడు సతీశ్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతరం వీరిని డీఈవో దుర్గా ప్రసాద్, కమ్మరపల్లి ఎంఈవో ఆంధ్రయ్య, నోడల్ అధికారి గంగాధర్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, చంద్ర శేఖర్, అంజద్ అభినందించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



నెమ్లిలో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



సాందీపని కాలేజీలో ఉదయ్‌కిరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబా

నస్రుల్లాబాద్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏ శరణ్య, కె రమ్యశ్రీ, సాహిత్య ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం వారిని పాఠశాలలో సన్మానించారు. ఈ నెల 21 నుంచి ఒడిశాలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం దుర్గాబాయి తెలిపారు. పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు ప్రతాప్ సింగ్, సాయిలు, ఎస్‌ఎంసీ చైర్మన్ సాయిలు, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.



అరవింద్

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన ధర్మయ్యోల అరవింద్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ బాలయ్య, సర్పంచ్ సంజీవులు తెలిపారు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్‌ను అభినందించారు. వైస్ ఎంపీపీ నర్సింలు, జగదీశ్వర్, వీడీసీ చైర్మన్ రాజు, స్వామి ఉన్నారు.

కామారెడ్డి టౌన్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం ఉదయ్ కిరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయిబాబ బుధవారం తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు. అకాడమిక్ కో–ఆర్డినేటర్ మనోజ్ కుమార్ ఉన్నారు.

చిరంజీవాచార్యులకు సన్మానం



చిరంజీవాచార్యులను సన్మానిస్తున్న హనుమాన్‌శాస్త్రి శ్రీనివాస్

నిజామాబాద్ సిటీ: భద్రాచలం శ్రీరాముడి ఆలయంలో ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా హరికథా గానం చేసిన నిజామాబాద్‌కు చెందిన చిరంజీవాచార్యులను ఆలయ కమిటీ స్థానాచార్యులు హనుమాన్ శాస్త్రి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. మంగళవారం రాత్రి అనేక ప్రాంతాల వారి సాంస్కృత, సాహిత్య, నృత్య, హరికథ నాటక ప్రదర్శనలు జరుగగా నిజామాబాద్‌కు చెందిన చిరంజీవాచార్యుల చే పరశు రామవతార సందర్శనలో భాగంగా మహాభారతంలోని ద్రౌపది స్వయం వరం హరికథ గానం చేశారు. దీనికిగాను భద్రచలం ఆలయ కమిటీ హనుమాన్ శాస్త్రి శ్రీనివాస్, ఆలయ ఈవో రమాదేవి చిరంజీవాచార్యులను ప్రశంసపత్రం, నగదుతో ఘనంగా సత్కరించారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి



తెయూ/ నిజామాబాద్ అర్బన్: తెయూ పరిధిలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజ్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో కొనసాగుతున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు.

దోమకొండలో ముగ్గురు మహిళల హల్‌చల్



పోలీసుల అదుపులో ఉన్న మహిళలు

దోమకొండ: మండల కేంద్రంలో ముగ్గురు మహిళలు బుధవారం రాత్రి హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన పందిరి కాశీనాథ్ ఇంట్లో చొరబడి బంగారు గొలుసు, డబ్బులు దొంగిలించారంటూ కాలనీవాసులు వారిని పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్న పీఎస్‌కు తరలించారు. మహిళలు మద్యం తాగి, పెప్పర్‌స్రే, కట్టర్, చాకు, సుత్తి కలిగి ఉన్నారని పేర్కొన్నారు. తమది మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామమని తన పేరు బూస కవిత అని సదరు మహిళ తెలిపారు. దోమకొండకు చెందిన కాశీనాథ్ తమకు గతంలో రూ.5లక్షలు అప్పు ఇచ్చాడని, తన భర్త చనిపోగా ఇల్లు అమ్మి డబ్బులు కట్టానని చెప్పారు. ప్రామిసరీ నోట్లను చించివేసిన కాశీనాథ్ రెండేళ్ల తర్వాత తాము ఇచ్చిన చెక్కులపై చెక్‌బౌన్స్ కేసు వేశాడన్నారు. దీంతో తాను అతడిపై వేదింపుల కేసు పెట్టానని పేర్కొన్నారు. రాజీకి వచ్చిన కాశీనాథ్ కేసులు విరమించుకుందామని చెప్పగా, తాను ముందు కేసు విరమించుకున్నానని, కానీ అతడు కేసు విరమించుకోలేదని చెప్పారు. కాగా సదరు మహిళలు చెబుతున్న మాటలు వాస్తవం కాదని, తనపై హత్యాయత్నానికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేయాలని కాశీనాథ్ పోలీసులను కోరాడు. పైఅధికారుల సూచన మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర్ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఈవో వేణు, ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని భక్తుల ద్వారా లెక్కింపు చేపట్టారు. రూ. 4,19,673 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిజామాబాద్ రూరల్: ముబారక్‌నగర్ సమీపంలోని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్, రూరల్ ఎస్సై మహేశ్ కుమార్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 27,230 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల విచారణ

ధర్పల్లి: మండలంలోని దుబ్బాకలో పద్మశాలీ కులస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు సీఐ సైదా బుధవారం తెలిపారు. గ్రామ కమిటీ మాట విననందుకు తమ పద్మశాలీ కులస్తులను బహిష్కరించినట్లు సంఘ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో విచారణ చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.కేసు విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

పోలీసులకు వినతి

మండలంలో దుబ్బాక గ్రామానికి చెందిన గ్రామ కమిటీ సభ్యులు సీఐ సైదాకు బుధవారం వినపత్రాన్ని అందజేశారు. తాము గ్రామంలో ఎవరిని సాంఘిక బహిష్కరణ చేయలేదని పేర్కొన్నారు. తాము చట్టాలకు కట్టుబడి ఉన్నామని, గ్రామంలో విచారణ చేపట్టాలని సీఐని కోరారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: ఇటుక బట్టీ కూలీలను మోసం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దయాళ్‌సింగ్ బుధవారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఇటుక బట్టీ యజమాని కూలీలను తీసుకురావాలని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన తబీరాబాగ్‌కు నెల రోజుల కూలీ డబ్బులను సైతం ఇచ్చాడు. తబీరాబాగ్ కూలీలకు డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడు. దీంతో ఇటుక బట్టీ యజమాని ఫిర్యాదు మేరకు తబీరాబాగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కూలీలకు పని కల్పించాలి



లింగంపేటలో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సాయన్న



ముస్తాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

లింగంపేట: ప్రతి గ్రామ పంచాయతీలో నిత్యం 50 మందికి తక్కువ కాకుండా ఉపాధి పనులు కల్పించాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ఏడాది నుంచి చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నర్సరీల్లో విత్తనాలు నాటి వర్షాకాలానికి మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ముస్తాపూర్ గ్రామ శివారులోని పర్కులేషన్ ట్యాంకు, నర్సరీలను పరిశీలించారు. పర్కులేషన్ ట్యాంకుల ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకరాచారి, ఏపీవో అన్నపూర్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గాంధారి: ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో సతీష్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేయాలని, కూలీలు అధిక సంఖ్యలో పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హరిత హారం కోసం నర్సరీలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: మున్నూరు కాపు విద్యార్థులకు 2022–23 విద్యా సంవత్సర ప్రతిభ పురస్కారాలు ఇవ్వడానికి ఈనెల 28 వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్య, అంజయ్య, సమన్వయకర్త నీలం నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో 90శాతంపై మార్కులు పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ, పిజీ, ప్రొఫెషనల్ కోర్సులు చేసిన విద్యార్థులు 80శాతం పైగా మార్కులు పొంది ఉండాలన్నారు. విద్యార్థులు తమ మార్కుల జబితా, మున్నూరుకాపు కుల ధ్రువీకరణ, రెండు ఫొటోలు జత చేసి మున్నూరుకాపు ట్రస్ట్, కాచిగూడ, హైదరాబాద్ అడ్రసులో అందజేయాల ని కోరారు. వివరాలకు 9949065444, 9441631943 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విరిగిపోయిన స్తంభం

రుద్రూర్: అడవి పందులు రోడ్డుపై అడ్డుగా రావడంతో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన మండలంలోని అక్బర్‌నగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంబం గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో వర్నికి వెళ్తుండగా అక్బర్‌నగర్ వద్ద అడవి పందులు ఒకేసారి రోడ్డుపైకి వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. దీంతో స్తంభం విరిగిపోయింది. స్థానికులు వెంటనే గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కారులో ఉన్న వారు వారు క్షేమంగా బయట పడ్డారు.

ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

భిక్కనూరు: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన మల్లేశ్‌రెడ్డి, భిక్కనూరుకు చెందిన చేపూరి బలరాం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని కామారెడ్డి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి వీరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సదాశివనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మక్కల లోడ్‌తో కామారెడ్డి వైపునకు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు కొందికి దూసుకెళ్లింది. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో లారీ ముందుభాగం దెబ్బతిన్నది. డ్రైవర్, క్లీనర్లకు స్వల్పగాయాలైనట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



బోజేందర్(ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన సల్లా బోజేందర్(50) బాత్ రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోజేందర్ కొంత కాలంగా వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం బాత్‌రూం వెళ్లిన బోజేందర్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

మాక్లూర్: సౌదీ అరేబియాలో రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన పట్నం ఇస్తారి (45) మృతదేహం స్వగ్రామమైన రాంచంద్రపల్లికి బుధవారం చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లిన ఇస్తారి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సహాయంతో బీజేపీ నాయకుడు మహేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిరూరల్: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్ బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 12 వాహనాలకు జరిమానా విధించి సీజ్ చేసినట్లు వెల్లడించారు. వాహనదారులు ధ్రువీకరణపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.